క్లుప్తంగా

ఎన్నికల సంస్కరణలపై సూచనలివ్వండి
కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అవసరమైన సలహాలు, సూచనలు ఈ నెల 31వ తేదీ నాటికి అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో నూతన సంస్కరణలు తీసుకొచ్చే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి సూచనలు, సలహాలు ఆహ్వానిస్తోందన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, 1951, ఓటరు నమోదు నియమాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి వంటి అంశాలపై సూచనలు అందజేయవచ్చన్నారు. వచ్చిన సూచనలు, సలహాలపై భారత ఎన్నికల సంఘం ఏప్రిల్ 30న అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తుందని కలెక్టర్ తెలిపారు. పదో తరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు.

రాములోరి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

తాళ్లరేవు: పటవల పంచాయతీ రాఘవేంద్రపురం గ్రామంలో వేంచేసి యున్న కోదండ కల్యాణ రాముని విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కరప మండలం గొర్రిపూడికి చెందిన శైవాగమ ప్రతిష్ఠాచార్య పూజ్యం సాంబశివరావుశర్మ తనయుడు పూజ్యం మల్లికార్జున శర్మ బ్రహ్మత్వంలో బాదంపూడి వైద్యనాథ శర్మ నేతృత్వంలో ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, దీక్షాధారణ, అంకురార్పణం, ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పుణ్య దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

వాసవీ జాగృతి క్లబ్ ప్రారంభం

అమలాపురం టౌన్: వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నాగుమల్లి రాజరావు ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో జాగృతి క్లబ్ బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ అధ్యక్షుడు తిరివీధి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమలాపురం వాసవీ జాగృతి క్లబ్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. క్లబ్ అధ్యక్షునిగా పసలపూడి సతీష్, కార్యదర్శిగా తటవర్తి వెంకట సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా యర్రమిల్లి కుమార్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ప్రతినిధులచే క్లబ్ డిప్యూటీ గవర్నర్ చక్కా ప్రవీణ్ ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మురళీ మోహనరావు, ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షురాలు యెందూరి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 524 మంది గైర్హాజరు

అమలాపురం టౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం జరిగిన జనరల్, ఒకేషనల్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 524 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి భౌతికశాస్త్రం, అర్థశాస్త్రం పరీక్షలకు 10,330 మంది హాజరు కావాల్సి ఉండగా 9,970 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు సంబంధించి 2,418 మంది హాజరు కావాల్సి ఉండగా 2,254 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆలమూరు, మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మండపేట శ్రీవైష్ణవి, రామచంద్రపురం నారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటైన పరీక్షా కేంద్రాలను డీఐఈవో వనుము సోమశేఖరరావు తనిఖీ చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

ముమ్మిడివరం: మండలంలోని గాడిలంకలో సుమారు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ, విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ బాదంపూడి ప్రసాదశర్మ బ్రహ్మత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యజమానులు పిండి లక్ష్మణమూర్తి, సరోజ, కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, సత్యవేణి, తాడి తరుణ్ సుబ్రహ్మణ్యం, సాయిదుర్గ దంపతులతో పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు.

ఈడీసీ చైర్మన్ సుబ్బారావు మృతి

తాళ్లరేవు: సిద్ధార్థ ఎకో డెవలప్‌మెంట్ కమిటీ(ఈడీసీ) చైర్మన్ కోరుకొండ సుబ్బారావు(65) బుధవారం మృతి చెందారు. ఈయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సుబ్బారావు మృతికి ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్, సెక్షన్ ఆఫీసర్‌లు సిద్ధార్థ, వీరభద్రరావు, బీట్ ఆఫీసర్‌లు, సిబ్బంది సంతాపం తెలియజేశారు.

మేత బస్తాల చోరీపై ఫిర్యాదు

అల్లవరం: మొగళ్లమూరు సెంటర్లో మేత బస్తాల గోదాంలో ముగ్గురు యువకులు చోరీకి పాల్పడిన ఘటనపై షాపు యజమాని రమేష్‌రాజు అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో ముగ్గురు యువకులు రెండు మోటారు సైకిళ్లపై గోదాము వద్దకు వచ్చి బయట ఎవరూ లేని సమయం చూసి షాపులోకి చొరబడి మేత బస్తాలను ఎత్తుకెళ్లారు. షాపు వద్ద ఏర్పాటు చేసిన సీసీ పుటేజీలో యువకుల కదలికలు రికార్డ య్యాయి.

వైఎస్సార్ సీపీ పాలనలో పేదలు హ్యాపీ

- ప్రజల హృదయాల్లో కొలువైన నాయకుడు వైఎస్ జగన్
- పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి విశ్వరూప్
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం


అమలాపురం హైస్కూల్ సెంటరులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వరూప్, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, పార్టీ నాయకులు


ముమ్మిడివరంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే పొన్నాడ, పార్టీ శ్రేణులు


ఉప్పలగుప్తంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు


తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలించిన అయిదేళ్లూ సంక్షేమాన్ని వరదలా పారించి పేదల బతుకుల్లో సరికొత్త వెలుగులు నింపిందని జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అందుకే పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేటికీ ఆ పేదల గుండెల్లో దేవుడిగా కొలువయ్యారని ఆయన గుర్తు చేశారు. పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక హైస్కూలు సెంటరులో విశ్వరూప్ పార్టీ జెండాను బుధవారం ఉదయం ఆవిష్కరించి ప్రసంగించారు. అనంతరం ఆ సెంటరులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓ పండుగలా చేసుకున్నారు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం పట్టణ, అల్లవరం మండల పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, కొనుకు బాపూజీ, అమలాపురం, అల్లవరం ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, అమలాపురం, ఉప్పలగుప్తం జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, పార్టీ జిల్లా అనుబంధ కమిటీల అధ్యక్షులు జాన గణేష్, షేక్ అబ్దుల్ ఖాదర్, వంగా గిరిజాకుమారి, జిన్నూరి వెంకటేశ్వరరావు, తోరం గౌతమ్ రాజా, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు కుడుపూడి బాబు, ఉండ్రు వెంకటేష్, కముజు రమణ, సరెళ్ల రామకృష్ణ, వంటెద్దు వెంకన్నాయుడు, చెల్లుబోయిన నాని, గుత్తుల చిరంజీవిరావు, కుడుపూడి భరత్ భూషణ్, గొవ్వాల రాజేష్, దాసరి అరుణ, కుడుపూడి త్రినాథ్, దంగేటి రుద్ర, కల్వకొలను ఉమ, కేతా భాను తదితరులు పాల్గొన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల అనంతరం పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు మోటారు సైకిళ్లపై ర్యాలీగా జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ జరిగిన యువత పోరులో భాగస్వాములయ్యారు.

పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. తొలుత స్థానిక పోలమ్మ చెరువు వద్ద గల దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని అయినాపురం, అన్నంపల్లి, పదవ మైలురాయి, కొత్తలంక తో పాటు పలు గ్రామాలలో పార్టీ శ్రేణులు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స చిట్టిరాజు, డిల్లీ నారాయణ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీలు కోలా గంగా భవానీ, మిరియాం జ్యోతి, కాశి బాలముని కుమారి, జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి శంకరరావు, దొమ్మేటి శామ్యూల్ సాగర్, కోలాబాబ్జీ, మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం, టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, రెడ్డి శివన్నారాయణ, మట్టపర్తి సత్యనారాయణ, మోకా రామారావు, కర్నీడి రాధాకృష్ణ, బొర్రా విష్ణు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లరేవులో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. స్థానిక చెరువుగట్టు సెంటర్‌లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు హాజరై కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ అనితర సాధ్యంకాని సంక్షేమ పథకాలను అమలు చేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందిందన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిరాటంకంగా కొనసాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం త్వరలోనే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాద గోవిందకుమార్, బొంతు మోహన్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, సర్పంచ్‌లు వెంటపల్లి నూకరాజు, పంపన రామకృష్ణ, ముద్దన ప్రసాద్, నాయకులు ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, పోతుల రత్నకుమారి, కోరుకొండ కిరణ్ కుమారి, చంటి, రెడ్డి సతీష్, పెట్ల సూర్యనారాయణ రాజు, రత్స ముత్యాలు, నందికోళ్ల శ్రీమన్నారాయణ, రెడ్డి నాగేశ్వరరావు, పేర్ని ఆదినారాయణ మూర్తి, ఆకుల వెంకటేశ్వర్లు, కొల్లు శ్రీనివాసరావు, దవులూరి శ్రీరామ్మూర్తి, రేవు నాగేశ్వరరావు, అనిశెట్టి శ్రీనివాసరెడ్డి, పందిరిపల్లి రాజేష్, సంగాని దాసు, గురజాపు లోవరాజు పాల్గొన్నారు.

సంక్షోభ పాలన

ఉప్పలగుప్తం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పాలన దిశగా సాగిన రాష్ట్రం ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సంక్షోభ పాలనగా మారిందని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం మెయిన్ సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ స్థూపం వద్ద పార్టీ నాయకులు పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు పార్టీ జెండాను ఎగురవేశారు. పార్టీ కార్యకర్తలంతా శుభాకాంక్షలు తెలుపుకుని స్వీట్లు పంచిపెట్టారు. రాబోయే కాలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకుని వచ్చే విధంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని దిశా నిర్దేశం చేసుకున్నారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిక్కం బాలసుబ్రహ్మణ్యం, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల హనుమంతు శ్రీనువాసరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, పెయ్యిల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుమూడి కొండబాబు, బీసీ సెల్ అధ్యక్షుడు యనమదల పల్లంరాజు, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, ఉప సర్పంచ్ మోకా శ్రీను, పార్టీ నాయకులు, కుంచే చిన్నీ, అంగాని సాంబశివరావు, చీకట్ల రెడ్డి నాయుడు, యాళ్ల చిన్నా, ఎస్.ఎస్.కుమార్, నల్లా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూత్రపిండాల రక్షణకు ముందస్తు పరీక్షలే కీలకం

వైద్య శిబిరంలో నెఫ్రాలజిస్టుల సూచన

అమలాపురం టౌన్: మూత్రపిండాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందస్తుగా చేయించుకునే పరీక్షలే కీలకంగా మారతాయని డయాలిసిస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాహైల్ స్పష్టం చేశారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా అపోలో డాయలిసిస్ క్లినిక్స్ సంస్థ స్థానిక తామర చెరువు పార్కు వద్ద బుధవారం ఉచిత మూత్ర పిండాల వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ వైద్యశిబిరం ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ సాహైల్ మాట్లాడారు. నెఫ్రాలజిస్టులు ఈ శిబిరంలో రోగులకు వైద్యసేవలు అందించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రతన్ బెనర్జీ విజయ్, అమలాపురం అపోలో డయాలిసిస్ యూనిట్ ఇన్‌చార్జి చప్పిడి దుర్గాప్రసాద్, డాక్టర్ జోసఫ్ తదితరులు వైద్యశిబిరంలో రోగులకు వైద్యసేవలు అందించారు. అపోలో డయాలిసిస్ క్లినిక్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకరరావు, మేనేజర్ మధు కిరణ్ వంటిపల్లి మాట్లాడుతూ ప్రజలకు మూత్రపిండాల ఆవశ్యకత, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దాదాపు 200 మంది మూత్రపిండాల రోగులు ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ

అమలాపురం టౌన్: కళ్లు గ్లకోమా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవాలని డీఎం హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర సూచించారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద బుధవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రారంభ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర ప్రసంగించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ జరిగింది. గ్లకోమా వారోత్సవాలు జిల్లాలో ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ జరుగుతాయని డాక్టర్ వి.ప్రభాకర్ తెలిపారు. ఆస్పత్రి సూరింటెండెంట్ డాక్టర్ శంకరరావు, డాక్టర్ రాంజీ అవగాహన సదస్సులో ప్రసగించి జాగ్రత్తలను వివరించారు. పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

హోరెత్తిన యువత పోరు



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న మాజీ మంత్రి విశ్వరూప్, పార్టీ నాయకులు

- ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై గళమెత్తిన విద్యార్థులు
- అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

అమలాపురం రూరల్: వైఎస్ఆర్ సీపీ పిలుపు మేరకు యువత పోరుబాట ఆందోళనకు అమలాపురం నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత తరలివచ్చారు. అమలాపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యువత పెద్ద సంఖ్యలో హాజరై నిరసనతో హోరెత్తించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో అమలాపురం పట్టణంలోని నల్లవంతెన వద్ద నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కూటమి ప్రభుత్వంపై గళమెత్తారు. అమలాపురం నియోజవర్గం పరిధిలో అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల పరిధిలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు నల్లవంతెన నుంచి ర్యాలీగా తరలివెళ్లి కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో రాజకుమారికి వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు విశ్వరూప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగ భృతి రూ.3వేలు, 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, అంబాజీపేట మండల అధ్యక్షులు సంసాని బుల్లినాని, బద్రి బాబ్జి, కొనుకు బాపూజీ, విత్తనాల శేఖర్, ఎంపీపీలు కుడిపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషారావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరిరామ్ గోపాల్, గెడ్డం సంపదరావు, కొనుకు గౌతమి, జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, వైస్ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణ, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, బొక్కా ఆదినారాయణ, కూడుపూడి వెంకటేశ్వర బాబు, పినిపే శ్రీకాంత్, కడిమి చిన్నవరాజు, కుంచే రమణారావు, పినిపే జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలివ్‌రిడ్లే తాబేళ్లను సంరక్షించాలి

తాళ్లరేవు: తీర ప్రాంతాల్లో సంచరించే ఆలివ్ రిడ్లే తాబేళ్ల సామూహిక మరణాలను నివారించాలని కోరుతూ వైల్డ్ క్యానోపి హాబిటేట్స్ ఓషన్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ సంస్థాపకుడు సంగాడి ధర్మారావు కాకినాడ జిల్లా జేసీ రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేశారు. పురాతన సముద్ర ప్రాణులు మానవుల నిర్లక్ష్యపు చర్యల కారణంగా మృతి చెందుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వాలు స్పందించి కాలుష్య నియంత్రణ చర్యలను కఠినంగా అమలు చేయాలని, తాబేళ్లు గుడ్లు పెట్టే సమయంలో యంత్రాల సహాయంతో చేపల వేటను నిషేధించాలని, అక్రమ ట్రాలింగ్ కార్యకలాపాలపై పర్యవేక్షణ కఠినతరం చేయాలని వినతిపత్రంలో కోరారు.

ఉత్సవ దేవాలయాల వార్షిక క్యాలెండర్ రూపొందించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా సనాతన హిందూ ధర్మానికి అద్దం పట్టే విధంగా ఎన్నో దేవాలయాలకు నిలయంగా ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోందని కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఐదు వేల భక్తులు సందర్శించుకునే ఉత్సవ దేవాలయాల వివరాలపై కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ, దేవాలయ శాఖ, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సనాతన హిందూ ధర్మం పరిఢవిల్లే రీతిలో ఉన్న 17 ముఖ్య దేవస్థానాల్లో ఉత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఉత్సవాలపై ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31 వరకు వార్షిక క్యాలెండర్‌ను రూపొందించాలని దేవస్థాన అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రధానంగా ఐదు ముఖ్య దేవాలయాలైన అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలు, వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక తీర్థ కల్యాణ మహోత్సవాలు, అయినవిల్లి సిద్ధి వినాయక స్వామి ఉత్సవాలు, అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం ఉత్సవాలు ఏర్పాట్లపై మాస్టర్ ప్లాన్‌ను దేవదాయ, రెవెన్యూ అధికారులు దీర్ఘకాలిక కార్యనిర్వాహక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు.

జిప్‌మెర్‌లో నో స్మోకింగ్ డే

ఆలోచింపజేసిన వైద్య సిబ్బంది ప్రదర్శనలు

యానాం: ధూమపానం వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు సోకుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ధూమపానంతో ప్రతి ఏడాది 80 లక్షల మందికి పైగా మరణిస్తున్నారని జిప్‌మెర్ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి ఆనంద్‌రాజ్ పేర్కొన్నారు. ధూమపానం అనర్థాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ఏటా మార్చి రెండో బుధవారం నో స్మోకింగ్ డేని జరుపుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని జిప్‌మెర్ ఆసుపత్రి ఆవరణలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై వైద్య సిబ్బంది చేపట్టిన నాటక ప్రదర్శన అందరినా ఆలోచింపజేసింది.

వాకర్స్ హెల్త్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

అమలాపురం టౌన్: అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్‌కు ఎన్నికైన నూతన కార్యవర్గం స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. అంతర్జాతీయ వాకర్స్ ప్రతినిధి ఎం. ప్రభావతి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షునిగా పనిచేస్తున్న బోణం సత్య వరప్రసాద్‌ను వాకర్స్ మరోసారి క్లబ్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకార సభకు అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

పాఠశాలలకు నేడు సెలవు

యానాం: స్థానిక భూ సమేత వేంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అన్ని పాఠశాలలు, విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు బుధవారం ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

అభయారణ్యం సందర్శన

తాళ్లరేవు: కోరంగి అభయారణ్యాన్ని బుధవారం తమిళనాడు ఫారెస్ట్ అకాడమీ సభ్యుల బృందం సందర్శించింది. తమిళనాడు నుంచి వచ్చిన 18 మంది సభ్యులు అభయారణ్యాన్ని సందర్శించి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్‌తో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు, బీట్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి రథయాత్ర

యానాం: స్థానికంగా కొలువైన వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా గురువారం జరిగే ప్రధాన ఘట్టమైన స్వామివారి రథయాత్ర నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఫాల్గుణ మాసంలో ఇరవై నాలుగు రోజుల పాటు కల్యాణోత్సవాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. కల్యాణం ఫాల్గుణ శుద్ధ ద్వాదశి నాడు అంటే పన్నెండవ రోజు నిర్వహిస్తారు. పద్నాలుగో రోజు రథోత్సవాన్ని నిర్వహిస్తారు. చిన్నాసెంటర్ నుంచి పిల్లారాయవీధి మీదుగా వెళ్లి కొత్తబస్టాండ్ వద్ద రథయాత్ర ముగుస్తుంది. ఉత్సవాలకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరు కానున్నారు.

రూ.13,500 కోట్లతో బడ్జెట్ సమర్పణ

యానాం: కేంద్ర ప్రభుత్వం, పుదుచ్చేరి ప్రభుత్వాల మధ్య సన్నిహిత సహకారం కారణంగా గత నాలుగేళ్లుగా ప్రగతిశీల సంక్షేమ పథకాలను అమలు చేయగలిగామని సీఎం రంగసామి పేర్కొన్నారు. బుధవారం 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.13,600 కోట్ల వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి హోదాలో అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఆర్థికాభివృద్ధికి ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధిలో వృద్ధిని కొనసాగించ గలిగినట్లు తెలిపారు. పుదుచ్చేరి సొంత ఆదాయ వసూళ్లు సుమారు రూ.7,641 కోట్లుగా అంచనా వేసినట్లు తెలిపారు. ఆర్థికలోటు అంతరాన్ని పూడ్చేందుకు రూ.2,101.42కోట్ల మేర ఋణం సీలింగ్(ఎన్‌బిసి)కు కేంద్ర ప్రభుత్వం తన ఆమోదాన్ని తెలిపిందన్నారు.